క్లుప్తంగా

డైయింగ్ యూనిట్ల మూసివేతకు సంతకాల సేకరణ


సంతకాల సేకరణ చేస్తున్న ప్రజా సంక్షేమ సంఘ సభ్యులు

నగరి: పట్టణంలో కలుషిత రంగునీటి సమస్య పరిష్కారానికి నగరి ప్రజల సంక్షేమం సంఘం నడుం బిగించింది. ప్రజల ఆరోగ్యం కాపాడటమే లక్ష్యంగా తమ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. డైయింగ్ యూనిట్ల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ శుక్రవారం కరపత్ర ప్రచారం చేసింది. డైయింగ్ యూనిట్లు మూసివేయాలని, దూర ప్రాంతాలకు తరలించాలని సంతకాలు సేకరించింది. కార్యక్రమంలో నగరి ప్రజా సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సాంకేతికతపై అవగాహన అవసరం

పెనుమూరు(కార్వేటినగరం) : రైతులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రైతులకు వ్యవసాయంలో రైతులకు ఉపయోగపడే కొన్ని యాప్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులకు వ్యవసాయంలో ఉపయోగపడే అగ్రికల్చర్, వ్యవసాయం, ప్లాంటిక్స్, ఎన్‌పీఎస్‌ఎస్ వంటి యాప్‌లను వినియోగించుకుని డిజిటల్ పేమెంట్, వాతావరణ వివరాలు, మార్కెట్ ధరలు వివరాలను తెలుసుకోవచ్చని తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థం


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

పాలసముద్రం : బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలున్నాయని, వివాహం చేసిన వారితో పాటు ప్రోత్సహించిన వారిని నేరస్తులుగా పరిగణిస్తారని శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ మహేష్ బాబు తెలిపారు. శుక్రవారం సీఎం కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసంలో భాగంగా బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ గాలి మహేష్ బాబు మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, నివారించటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. చిన్న వయస్సులో ఆడపిల్లలకు పెళ్లి చేసి వారిని వదిలించుకోవాలనే దృక్పథం మారాలన్నారు. మహిళా పోలీస్ మాధవి బాలల హక్కులు, రక్షణ, కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడ పిల్లల లింగ వివక్ష, సైబర్ నేరాలపై వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, డ్వాకా సంఘాల సభ్యులు, బాలికలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల సమస్యలు పరిష్కరించాలి


మద్దతు తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: సీహెచ్‌ఓల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేస్తున్న శిబిరం వద్దకు వెళ్లి మద్దతు తెలిపి మాట్లాడారు. గత 5 రోజులుగా సమ్మె చేస్తున్న వారిపై ప్రభుత్వం కనికరం చూపకపోవడం బాధకరమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు రాష్ట్రవ్యాప్తంగా తమ యూనియన్ మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు.

గురుకుల అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బంగారుపాళెం: స్థానిక గిరిజన గురుకుల(బాలురు)పాఠశాలలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ వెంకట సుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి 3 నుంచి 9వ తరగతి వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 3వ తరగతిలో ఎస్టీలు-32 మంది, ఎస్సీలు-5, బీసీలు-2 ఓసీ ఒక్కటి ఖాళీగా ఉన్నాయన్నారు. బ్యాక్‌లాగ్ ఖాళీలు ఎస్టీ విద్యార్థులచే భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

బ్యాక్‌లాగ్ ఖాళీలు: 4వ తరగతిలో 38, 5వ తరగతిలో 34, 6వ తరగతిలో 32, 7వ తరగతిలో 16, 8వ తరగతిలో 19, 9వ తరగతిలో 16 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి లక్ష రూపాయల ఆదాయం ఉండాలన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ లోపు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 99894 68202ను సంప్రదించాలని కోరారు.

8న కుంభాభిషేకం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలంలోని అలుకూరుపల్లి గ్రామంలో ఈనెల 8, 9వ తేదీల్లో నూతనంగా నిర్మించిన శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణ భజన మందిర మహా కుంభాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 8న హోమపూజలు, 9న శిఖరగోపుర మహా కుంభాభిషేకం, ప్రాణ ప్రతిష్ట ఉంటుందని చెప్పారు.

క్రీడల్..శిబిరాలు నిల్..!

జిల్లాలో కొన్నిచోట్ల వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. విద్యా సంవత్సరం ముగిసిన అనంతరం సెలవులు వృథా చేసుకోకుండా ఆటలతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నదే ప్రధానంగా ఈ శిబిరాలు ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచడానికి అప్పటి మంత్రి ఆర్కేరోజా మైదానంలో ప్రత్యేక వసతులు ఏర్పాటుచేసి వేసవి శిబిరాలను ప్రారంభించి వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి, అప్పట్లో విద్యార్థులకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడింది. మైదానాలు కళకళలాడాయి. కూటమి ప్రభుత్వం పాలనలో ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉండడంతో విద్యార్థులు నిట్టూరుస్తున్నారు.

- వెలవెల బోతున్న మైదానాలు
- నిరాశతో క్రీడాకారులు
- దృష్టి సారించని ఎమ్మెల్యే


వెలవెలబోతున్న కేవీకే క్రీడా మైదానం

నగరి: ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీలు పట్టిన విద్యార్థులు వేసవి సెలవుల్లో ప్రభుత్వం నిర్వహించే వివిధ క్రీడల శిక్షణ శిబిరాల కోసం ఎదురుచూస్తుంటారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడం పరిపాటి. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్థానికంగా వేసవి క్రీడా శిబిరాల నిర్వహణ ఊసే ఎత్తుకోకపోవడంతో క్రీడాభిమానుల్లో అసంతృప్తి నెలకొంది.

తప్పని ఎదురుచూపులు

సాధారణంగా ఏటా ఏప్రిల్ చివరి వారం లేని పక్షంలో మే మొదటి వారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించేవారు. ప్రాంతాల వారీగా ఏ క్రీడలో విద్యార్థులకు ఆసక్తి ఉందో గుర్తించి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇచ్చి శిక్షణానంతరం ధ్రువ పత్రాలు ఇచ్చేవారు. ఇటీవల కాలంలో విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెరుగుతోంది. పలువురు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన వారూ ఉన్నారు. నియోజకవర్గంలో కబడ్డీ, క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, బాక్సింగ్, చెస్‌లలో రాణించిన క్రీడాకారులు ఎక్కువగా ఉన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది ఆయా క్రీడల్లో రాణించాలని ఉబలాటపడే వారెందరో ఉన్నారు. కానీ ఇప్పటివరకూ ఏ క్రీడాంశంలో కూడా శిక్షణ శిబిరం ప్రారంభించకపోవడం శాపమైంది. ప్రస్తుత ఎమ్మెల్యేకు అసలు క్రీడా శిబిరాల ఏర్పాటుపై శ్రద్ధ ఉందా, లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

పరీక్షలు పూర్తయినా..

పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. జిల్లా యంత్రాంగం ఇంతవరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ఊసే ఎత్తడం లేదు. ఈ ఏడాది మైదానాల ఏర్పాటు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించే కార్య క్రమాలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వేసవిలో మే 1 నుంచి 31 వరకు ఈ శిక్షణ శిబిరాలు నిర్వహించాలి. జిల్లాలో 50 శిబిరాలు కచ్చితంగా జరపాలి. వీటిపై ఆసక్తి కలిగిన 8 నుంచి 16 ఏళ్ల లోపు ఉండే బాలబాలికలు పాల్గొని ఆటల్లో తమ నైపుణ్యాలను మెరుగు పరచుకునేందుకు సాధనంగా వినియోగించుకునేవారు.


గత వేసవి సెలవుల్లో విద్యార్థులతో కళకళలాడిన కేవీకే మైదానం (ఫైల్)


వేసవి శిక్షణా శిబిరంలో క్రికెట్ ఆడి ఉత్సాహపరుస్తున్న మాజీ మంత్రి (ఫైల్)

గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడు

పెనుమూరు(కార్వేటినగరం) : గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామకృష్ణాపురం, గంధంవారిపల్లి, రామలింగాపల్లి, తూర్పుపల్లి, రాఘవరెడ్డిపల్లి, కత్తిరెడ్డిపల్లి, మాణిక్యాలపల్లి, కార్తికేయపల్లి, అట్లవారిపల్లి, గుట్టకింద ఇండ్లు, గోపాలపురం, రాచలింగాపురం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అలాగే అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడని అభివర్ణించారు. గ్రామాల్లో భగవద్గీతను ఊరేగిస్తూ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందు /జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షుడు చింత సుబ్రమణ్యం, రమణారెడ్డి, రేణుకాదేవి, పద్మావతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


రామకృష్ణాపురంలో భగవద్గీతతో సేవా సమితి సభ్యులు

వైభవంగా శంకరాచార్యుల జయంతి


ప్రత్యేక అలంకరణలో శంకరమఠం స్వాముల విగ్రహాలు

నగరి : మున్సిపల్ పరిధి కీళపట్టులోని త్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతిని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని ఆదిశంకర, మహాపెరియార్, పెరియార్ విగ్రహాలకు 108 కొబ్బరికాయలతో అభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. దర్శించుకున్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

వడమాలపేటలో..

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రామానుజాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని గుడి నుంచి దాసరి వీధిలోని రామాలయం వరకు మేళ తాళాలతో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. నిర్వాహకులు వేణు, హేమన్న, శేఖర్, హరిబాబు, బాలశంకర్ తదితరులు పాల్గొన్నారు.


వడమాలపేటలో స్వామి వారి ఊరేగింపు

యాళి వాహనంపై విహారం

పుత్తూరు: శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి అమ్మవార్లు యాళి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు మురళీగురుకుల్ స్వామి అమ్మవార్లకు అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి యాళి వాహనంపై కొలువు దీర్చారు. రాత్రి 8 గంటలకు మంగళ వాయిద్యాల హోరు నడుమ పురవీధుల్లో పార్వతీ పరమేశ్వరులు ఊరేగారు. భక్తులు ఇంటింటా కర్పూరహారతులిచ్చి మొక్కులు చెల్లించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. కోలా జనార్ధన్, గణపతి మోటార్ డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు ఉభయదారులుగా వ్యవహరించారు.


యాళి వాహనంపై విహరిస్తున్న పార్వతీ పరమేశ్వరులు

మూడు బాధ్యతల సూచికే యజ్ఞోపవీతం

పుత్తూరు: స్వీయ, కుటుంబం, సమాజం- అనే మూడు బాధ్యతల సూచికే యజ్ఞోపవీతమని శ్రీగాయత్రీదేవి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షులు ఆలూరు రామకృష్ణ పేర్కొన్నారు. శంకర జయంతి పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గాయత్రీ భవనంలో సామూహిక యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ, గాయత్రీ మంత్రం బుద్ధిని, తేజస్సుతో కూడిన స్వచ్ఛతను ప్రేరేపిస్తుందన్నారు. ఉపనయనం ఓ పవిత్ర దార వేడుకని, బ్రహ్మోపదేశం అని కూడా పిలుస్తారన్నారు. యజ్ఞోపవీత ధారణ పొందిన వారు నిత్యం త్రికాల సంధ్యావందనం చేయాలని మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ వేదం హరిప్రసాద్, వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు రమేష్‌బాబు, బాలాజీ, విజయకుమార్, రెడ్డిప్రకాష్, మల్లికార్జున శర్మ, శివకుమార్, పద్మ, చక్రపాణి, రమేష్‌బాబు, సేతురామన్‌శర్మ, బాలాజీ రావు, కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


యజ్ఞోపవీత ధారణ నిర్వహిస్తున్న వేదపండితులు

టవర్ నిర్మాణాన్ని అడ్డుకుంటాం


టవర్ నిర్మాణం వద్దంటున్న నల్లవెంగనపల్లె గ్రామస్తులు

వెదురుకుప్పం : మండలంలోని నల్లవెంగనపల్లెలో సెల్ టవర్ నిర్మాణం చేపడితే ఊరుకునేది లేదని, అడ్డుకుంటామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ మేరకు కాంట్రాక్టర్ జేసీబీ ద్వారా చేపడుతున్న పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో పనులు ఆగిపోయాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. నివాసాల పక్కన సెల్ టవర్లు నిర్మిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. నివాసాలకు దూరంగా సెల్ టవర్ నిర్మిస్తే ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు బి.శివాజీ, యువత వెంకటేష్, ధనరాజ్, బాలయ్య, హంసవేణి, చిన్నస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

పలమనేరు: పట్టణంలో నిర్వహిస్తున్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా గంగచాటు రెండో రోజైన శుక్రవారం స్థానిక గంగమ్మ ఆలయం వద్ద అమ్మవారికి పట్టణంలోని విశ్వబ్రాహ్మణులు పూజలు చేసిన అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు

పాలసముద్రం : చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. శుక్రవారం పాలసముద్రం సచివాలయాల పరిధిలోని చెత్త సేకరణ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అయ్యప్ప, మండల విస్తరణ అధికారి రమేష్, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వెదురుకుప్పం : ఆరోగ్య శాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం గంగాధర నెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం వెదురు కుప్పంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విలేజ్ క్లినిక్‌లో పనిచేస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, సీహెచ్‌వోలు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో యువత మండల మాజీ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యుడు మురళి, నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఉద్యమ పితామహుడు దాచూరి

ఐరాల: యూటీఎఫ్ ఉద్యమ పితామహుడు, ఉపాధ్యాయ ఉద్యమ మార్గదర్శకుడు దాచూరి రామిరెడ్డి అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. దాచూరి రామిరెడ్డి 9వ వర్ధంతిని పురస్కరించుకుని మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ దాచూరి యూటీఎఫ్‌కు చేసిన సేవలను, కృషిని కొనియాడారు. కుటుంబ జీవితాన్ని సైతం లెక్క చేయకుండా యూటీఎఫ్‌కు ఎనలేని సేవలని అందించారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిగా 1981 నుంచి 2000 మధ్య సేవలందించారన్నారు. ఆయనను నేటి ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ యూటీఎఫ్ నాయకులు కృష్ణారెడ్డి, జగన్నాథంనాయుడు, మండల యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి అరుణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, అసోసియేట్ అధ్యక్షులు జనార్దన్, అమ్ములు, మహిళా కార్యదర్శి రాధిక తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

భక్తిశ్రద్ధలతో మహా భారత ఉత్సవాలు


కళాకారులను సత్కరిస్తున్న ప్రకాష్ కుటుంబ సభ్యులు, భక్తులు

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంట ద్రౌపదీ దేవి ఆలయంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాలలో భాగంగా శుక్రవారం యజ్ఞ పూజలు ఘనంగా చేశారు. మధ్యాహ్నం హరికథ కాలక్షేపం నిర్వహించారు. సాయంత్రం ఉత్తర గోగ్రహణం కార్యక్రమం ఆకట్టుకుంది. గురువారం రాత్రి కీచకవధ నాటక ప్రదర్శన అలరించింది. నాటక ప్రదర్శనకు వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, రుయా అసిస్టెంట్ ప్రొఫెసర్ మీనాక్షి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాధా రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువత మండల మాజీ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, నరిసింహారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవం


కుంభాభిషేకం వేడుకల్లో మండల నాయకులతో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి

గంగాధర నెల్లూరు : మండలంలోని బుగ్గపట్నం పంచాయతీ మర్రిమానురు గ్రామంలోని కుప్పమ్మ తల్లి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు, మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. గంగాధర నెల్లూరు ఎంపీపీ అబ్బు అనిత, సర్పంచ్ మునిరాజారెడ్డి ఆధ్వర్యంలో కుంభాభిషేకం, అభిషేక వేడుకలకు రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, రాష్ట్ర గ్రీనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి , వైస్ ఎంపీపీ హరిబాబు, సురేంద్ర రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షులు ఏకాంబరం, ఢిల్లీ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి జగదీష్, రూప కుమార్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఉమామహేశ్వరి, గోవిందరెడ్డి, భారతి తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీసులు

పెనుమూరు(కార్వేటినగరం) : మండల పరిధిలోని కండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత , రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి భావ మరిది కుమారుడు రూపేష్, దీక్షితలకు శుక్రవారం జరిగిన వివాహ రిసెప్షన్‌కు రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూది మోహన్, బూత్‌కన్వీనర్ నారాయణరెడ్డి,తదితరులు ఉన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న నారాయణస్వామి

మాజీ ఉప ముఖ్యమంత్రిని కలిసిన నేతలు

కార్వేటినగరం : వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కలసి పని చేయాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మండల వైఎస్సార్‌సీపీ కార్యదర్శిగా నియామకమైన నందగోపాల్, కొల్లాగుంట వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం రాత్రి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

కిశోరి వికాసంపై అవగాహన



అవగాహన ర్యాలీ చేస్తున్న కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు

నింద్ర: కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నింద్రలో ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, 10 నుంచి 19 ఏళ్లలోపు బాలబాలికలకు 10వ తేదీ వరకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. బాల్య వివాహాలు చేయరాదని, పోక్సో చట్టం గురించి అందరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామల, కార్యకర్తలు పాల్గొన్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గంగాధర నెల్లూరు : 95539 55610
నగరి : 95539 55609